సాక్షి వికారాబాద్

ఆదివారం । 15 । అక్టోబర్ । 2023



తీరొక్క పూలతో బతుకమ్మ

బతుకమ్మ పేర్చడం ఒక కళ. అందుకు కావాల్సిన పూలను సేకరించడం ఓ కళే.. 10లో▸



వేతనం రాదు

రెండు దశాబ్దాలుగా ఉపాధిహామీ పథకం లో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్నాం. కానీ మా కష్టాలు తీరవు. 10లో▸



'రియల్' దందా

మొయినాబాద్ మండలం బాకారం సమీపంలోని మాసాని కుంట రియల్ దందాలో మాయమైంది. 11లో▸

న్యూస్‌రీల్

శనైశ్చర స్వామికి తైలాభిషేకం



మోమిన్‌పేట: శని అమావాస్య సందర్భంగా భక్తులు శనివారం శనైశ్చర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మండల పరిధిలోని ఏన్కతలలో వెలిసిన స్వామి వారిని దర్శించుకునేందుకు ఉదయం 6గంటల నుంచే భక్తులు పోటెత్తారు. స్వామి వారికి ప్రీతియైన నల్లన దుస్తులు ధరించి నువ్వుల నూనెతో తైలాభిషేకం చేశారు. అనంతరం సప్త వృక్ష ప్రదర్శన నిర్వహించి నర్మద మాతను దర్శించుకున్నారు. పలువురు పితృదేవతలకు నైవేద్యం సమర్పించారు.

తనిఖీల తర్వాతే రాష్ట్రంలోకి అనుమతి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



చంద్రకల్ చెక్‌పోస్టును పరిశీలిస్తున్న లింగ్యానాయక్ తదితరులు

దౌల్తాబాద్: ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున సరిహద్దు ప్రాంతంలో ప్రతీ వాహనం తనిఖీ చేసిన తర్వాతే రాష్ట్రంలోకి అనుమతించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ పోలీసులకు సూచించారు. శనివారం ఆయన కర్నాటక సరిహద్దు ప్రాంతమైన చంద్రకల్ చెక్‌పోస్టును ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్నాటక నుంచి వచ్చే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. మద్యం, నగదు రవాణాను ఉపేక్షించొద్దన్నారు. ఆయన వెంట డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, సీఐ రాములు, ఎస్‌ఐ రమేశ్‌కుమార్, తహసీల్దార్ చంద్రశేఖర్ తదితరులున్నారు.

నేడు బీజేపీ ఎన్నికల సన్నాహక సమావేశం

తాండూరు టౌన్: పట్టణంలోని వెంకోబా గార్డెన్‌లో ఆదివారం బీజేపీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి కర్నాటక మాజీ సీఎం యడ్యూరప్ప తనయుడు విజయేంద్ర యడ్యూరప్పతో పాటు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి హాజరవుతారని చెప్పారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మొక్కల సంరక్షణకు రూ.4వేల ప్రోత్సాహం

ఐక్యరాజ్యసమితి సభ్యుడు రచిత్‌వర్మ

బషీరాబాద్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించాలని ఐక్యరాజ్య సమితి సభ్యుడు రచిత్‌వర్మ అన్నారు. జీకేఎఫ్ ఆగ్రో, జాగృతి గ్రామీణ అభివృద్ధి సంస్థ సంయుక్తంగా శనివారం మండల పరిధిలోని నవల్గాలో మొక్కల పెంపకం, ఆర్థిక వనరులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించాయి. ఈ సమావేశంలో రచిత్‌వర్మ మాట్లాడుతూ.. రైతులు తమ పొలాల్లో వృక్షాలుగా మారే మొక్కలను సంరక్షిస్తే ఐక్యరాజ్య సమితి నుంచి ఎకరాకు రూ.4వేల ఆర్థిక ప్రోత్సాహకం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, అండమాన్‌నికోబార్ దీవుల్లో అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐక్యరాజ్య సమితి బృందం సభ్యులు నవీన్, జాగృతి కోఆర్డినేటర్ రవికుమార్, జీకేఎఫ్ ప్రతినిధులు ఎస్‌కే పాషా, వంశీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ దసరా కానుక

మహేశ్వరం: దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ ప్రయాణికులకు లక్కీ డ్రా నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని మహేశ్వరం డిపో మేనేజర్ మోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ నెల 20నుంచి 23 వరకు, 28 నుంచి 30 వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన వారిని లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేస్తామన్నారు.తుక్కుగూడ బస్టాండ్‌లో 10 మంది పురుషులు, ఐదుగురు మహిళలకు ఒక్కొక్కరికి రూ.9,990 విలువ చేసే నగదు బహుమతులను అందజేస్తామని తెలిపారు.

జంపింగ్ జపాంగ్



ఎన్నికల షెడ్యూలు వచ్చింది మొదలు రాజకీయాలు మరింత రసవత్తరంగా మారాయి. అధికార బీఆర్‌ఎస్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించగా.. టికెట్లు దక్కని నేతలు అభ్యర్థిత్వం ఖరారు చేసుకుని పార్టీలు మారారు. నాటి నుంచి ద్వితీయ శ్రేణి నేతలు రోజుకో కండువా కప్పుకుంటున్నారు. దీంతో ఎవరు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటున్నారో తెలియని పరిస్థితి.

- ఎన్నికల వేళ గోడమీది పిల్లుల్లా వ్యవహరిస్తున్న నేతలు
- రోజుకో పార్టీ మారుతున్న నాయకులు
- కమిట్‌మెంట్‌లు.. సెటిల్‌మెంట్‌లతో ప్రతిపక్షాల గాలం
- గులాబీని వీడి హస్తం చెంతకు చేరుతున్న పలువురు ప్రజాప్రతినిధులు

తాండూరు: అసెంబ్లీ ఎన్నికల వేళ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు గోడమీది పిల్లిలా వ్యవహరిస్తున్నారు. తాండూరు నియోజకవర్గంలో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వర్గాలతో ప్రస్తుతం బీఆర్‌ఎస్‌గా బలంగా ఉంది. నెల రోజుల కిందటి వరకు అధికార పార్టీకి పోటీయే కనిపించలేదు. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ నుంచి ఇద్దరు బలమైన నేతలు టికెట్ రేసులో ఉండడంతో పొలిటికల్ వార్ ఒక్కసారిగా హీటెక్కింది. వారు గ్రామ స్థాయి నాయకులను తమవైపునకు తిప్పుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు.

కేడర్ పెంచుకునేందుకు యత్నం

గెలుపే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ముందుకెళ్తుండగా.. ప్రతిపక్ష నేతలు అధికార పార్టీకి కళ్లెం వేసేందుకు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. గులాబీ శ్రేణులను తమవైపు తిప్పుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. కాంగ్రెస్‌కు నెల క్రితం వరకు ఆశించిన స్థాయిలో నాయకులు కనిపించలేదు. డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి మధ్య టికెట్‌కు పోటీ కొనసాగుతుండడంతో ఒక్కసారిగా సీన్ మారింది. సీటు ఖరారు కాకముందే తాండూరులో ఎవరికి వారు తమ కేడర్‌ను పెంచుకునేందుకు పోటీ పడుతున్నారు.

విలువలకు తిలోదకాలు

నియోజకవర్గంలో నాలుగేళ్లుగా ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు పార్టీలు మారుతున్నారంటూ బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. విలువలను పాటించకుండా ఇతర ప్రాంతాల నుంచి డబ్బు సంచులతో వచ్చి నాయకులను కొనుగోలు చేస్తున్నారంటూ నిప్పులు చెరుగుతున్నారు.

రాజీబాటలో 'గులాబీ'లు

పట్నం మహేందర్‌రెడ్డి, పైలట్ రోహిత్‌రెడ్డి ఆధిపత్యపోరులో తీవ్రంగా నష్టపోయిన నాయకులు చేజారిపోకుండా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పావులు కదుపుతున్నారు. గతంలో బకాయి పడిన వారికి సెటిల్‌మెంట్ చేసి పార్టీ కోసం పని చేయాలని కోరుతున్నారు. పట్నం మహేందర్‌రెడ్డి వర్గానికి చెందిన నాయకులకు అధిక ప్రాధాన్యతనిస్తూ కార్యక్రమాలు చేపడుతున్నారు.

సర్పంచ్‌లకు సప'రేటు'

నియోజకవర్గంలో 75శాతం నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారు. దీంతో మండల, గ్రామ స్థాయి నాయకులను కాంగ్రెస్‌లోకి తీసుకువచ్చేందుకు యత్నిస్తున్నారు. బలమైన నాయకులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటుగా పార్టీ అధికారంలోకి వస్తే పదవులు ఇస్తామంటూ ఆఫర్ చేస్తున్నారు. నియోజకవర్గంలో 147 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మరో మూడు నెలల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగియనుంది. కానీ నేటికీ సర్పంచ్ ఎన్నికలకు చేసిన అప్పులు తీర్చని నాయకులను తమవైపు తిప్పుకొని ఆర్థిక భరోసా కల్పిస్తున్నారంటూ ప్రచారం సాగుతోంది. ఇప్పటికే పలువురు సర్పంచ్‌లు గులాబీ గూటిని వీడి హస్తం చెంతకు చేరడంతో ప్రచారానికి బలం చేకూరుతోంది. మరోవైపు పట్నం మహేందర్‌రెడ్డి, రోహిత్‌రెడ్డిల మధ్య నాలుగేళ్లుగా సాగిన వర్గపోరుతో ఆర్థికంగా చితికిపోయిన నాయకులపై సైతం కాంగ్రెస్ కన్నేసింది.

నేటి నుంచి దసరా బ్రహ్మోత్సవాలు

తేదీ	వాహన సేవ
15	హనుమత్ వాహనం
16	ముత్యాలపందిరి
17	శేష వాహనం
18	గరుడ వాహనం
19	గజ వాహనం
20	సింహ వాహనం
21	హంస వాహనం



అనంతగిరి: వికారాబాద్ పట్టణం ఆలంపల్లిలోని శ్రీ లక్ష్మీఅనంతపద్మనాభ స్వామి వారి ఆలయంలో ఆదివారం నుంచి దసరా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న ట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభం, ఈఓ నరేందర్ శనివారం ఓ ప్రకటనలో తెలి పారు. ఇప్పటికే ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. సాయంత్రం 4.30గంటలకు ధ్వజారోహణంతో ఈ ఉత్సవాలు ప్రారంభిస్తామని చెప్పారు. ప్రత్యేక పూజలతో పాటుగా ప్రతీ రోజు 7గంటలకు స్వామి వారికి వాహన సేవలుంటాయన్నారు. 22న ఆదివారం ఉదయం 10గంటలకు గరుడ వాహన సేవ, వసంతోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవార దసరా సందర్భంగా సాయంత్రం 4గంటలకు అశ్వవాహనంపై స్వామి వారి ఊరేగింపు ఉంటుందన్నారు. 5గంటలకు ఆలంపల్లి మైదానంలో రావణ దహనం అనంతరం పట్టణంలోని ప్రధాన వీధుల్లో స్వామి వారి వాహన సేవ కొనసాగుతుందన్నారు.

క్రీడా స్ఫూర్తిని చాటాలి



బ్యాడ్మింటన్‌లో తలపడుతున్న క్రీడాకారులు

మొయినాబాద్: పోటీల్లో క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఉప కార్యదర్శి వెంకటలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు గురుకులంలో జరుగుతున్న జోనల్ స్థాయి క్రీడా పోటీలు రెండో రోజు శనివారం రసవత్తరంగా కొనసాగాయి. వివిధ పోటీల్లో క్రీడాకారులు ఉత్తమ ప్రతిభతో ఆకట్టుకున్నారు. క్రీడాపోటీలను ప్రత్యక్షంగా వీక్షించిన వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. గురుకులాల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రాంతీయ సమన్వయాధికారి శారద, ప్రాంతీయ క్రీడాధికారి ఉదయ భాస్కర్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ ఆదిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'విజయ భేరి' మోగిద్దాం



అనంతగిరి: సభాస్థలిని పరిశీలిస్తున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, మాజీ మంత్రి ప్రసాద్ కుమార్

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

అనంతగిరి: కాంగ్రెస్ ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణంలోని చిగుళ్లపల్లి మైదానంలో నిర్వహించే విజయ భేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం వారు స్థానిక నాయకులతో కలిసి సభాస్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో నిర్వహించే ఈ సభకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు 10 వేల మంది కార్యకర్తలతో కాంగ్రెస్ కండువా కప్పుకుంటారని చెప్పారు. ఈ భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, సీనియర్ నాయకులు కిషన్నాయక్, అనంతరెడ్డి, నర్సింలు, రామచంద్రారెడ్డి, డి.లక్ష్మణ్ ముదిరాజ్, వాహిద్మియా, కిష్టారెడ్డి, ఖాలేద్, శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.50లక్షల పరిహారం ఇవ్వాలి

పరిగి: గ్రూప్–2 అభ్యర్థి ప్రవళిక ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణమని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని కొడంగల్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి ఆమెకు నివాళి అర్పించారు. అధికార పార్టీకి ఎన్నికల్లో యువత బుద్ధి చెప్పాలన్నారు. ప్రభుత్వం వారి కుటుంబానికి రూ.50లక్షల పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణప్రసాద్, ప్రధానకార్యదర్శి హన్మంత్ ముదిరాజ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, ఉపాధ్యక్షుడు ఎజాజ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్, పార్టీ నేతలు ఆంజనేయులు, నర్సింహులు, అయూబ్, నజీర్, అభిరామ్, రియాజ్, నాగవర్ధన్, శ్రీకాంత్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆచారి.. ఆరోసారి..



ఆమనగల్లు: జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ఆరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. కల్వకుర్తి నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున ఇప్పటికే ఐదుసార్లు పోటీ చేసిన ఆయన ఆరోసారి బరిలో నిలిచేందుకు అస్త్రశస్త్రాలు రెడీ చేసుకుంటున్నారు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నాయకుడిగా పేరున్న ఆయన విజయం అంచుల వరకూ వచ్చి ఓటమి చవిచూస్తున్నారు. ఈసారి విజయం ఖాయమని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.

వార్డు సభ్యుడిగా ప్రస్థానం

ఆమనగల్లు పట్టణానికి చెందిన ఆచారి బీజేపీలో జాతీయ స్థాయి నేతగా ఎదిగారు. 1984లో రాజకీయ అరంగేట్రం చేసిన ఆయన తొలిసారిగా ఆమనగల్లు పంచాయతీ వార్డు సభ్యుడిగా పోటీచేసి విజయం సాధించారు. 1996లో ఆమనగల్లు మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. మొదటి నుంచి బీజేపీలోనే ఉన్న ఆచారి గ్రామ కమిటీ, మండల, నియోజకవర్గ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. నాలుగేళ్ల క్రితం జాతీయ బీసీ కమిషన్ సభ్యుడిగా నియమితులై మూడేళ్ల పాటు తనదైన శైలిలో ముద్ర వేసుకున్నారు.


అలుపెరగని పోరాటం

1994లో తొలిసారి కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేసి 8,682 ఓట్లు సాధించారు. 2004లో 54 వేల ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు. 2009లో 25 వేల ఓట్లకే పరిమితమయ్యారు. 2014ఎన్నికల్లో విజయ తీరాల వరకూ వచ్చినా గెలుపును అందుకోలేకపోయారు. కేవలం 72 ఓట్ల స్వల్ప తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి చేతిలో ఓటమిచెందారు. 2018 ఎన్నికల్లో ఐదోసారి పోటీ చేసి 3 వేల ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు.

ఈసారైనా కలిసొచ్చేనా..?

కల్వకుర్తి నుంచి ఐదు సార్లు ఓటమిచెందిన ఆచారి ఆరోసారి బరిలో దిగనున్నారు. రెండుమూడు నెలలుగా నిత్యం రెండు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలను కలుస్తున్నారు. 'ఒక్క చాన్స్ ప్లీజ్' అంటూ అభ్యర్థిస్తున్నారు. రెండుసార్లు స్వల్ప తేడాతో ఓటమి చెందిన ఆచారి ఈసారి కల్వకుర్తిలో కాషాయ జెండా ఎగరేయాలని దృఢ సంకల్పంతో ఉన్నారు.

సమరానికి సై..



ప్రతిపక్షాలు సీట్లు సర్దుకునే లోపే గులాబీ బాస్ ఎన్నికల ప్రచారానికి తెరలేపారు. నేడు అభ్యర్థులకు బీఫాంలు ఇచ్చింది మొదలు గులాబీ నేతలంతా ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు.

- నేడు అభ్యర్థులకు బీఫాంలు అందించనున్న గులాబీ దళపతి
- రేపటి నుంచి ప్రచారంలోకి దూసుకెళ్లనున్న 'కారు'
- నాలుగు నియోజకవర్గాల్లో ఏర్పాట్లు సిద్ధం చేసుకున్న అభ్యర్థులు

వికారాబాద్: అధికార పార్టీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి సన్నద్ధమయ్యారు. గులాబీ దళపతి కేసీఆర్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో వారు ప్రచార రంగంలోకి దిగేందుకు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకున్నారు. ఆదివారం అధినేత అభ్యర్థులకు బీ ఫాంలు అందజేయనుండటంతో జిల్లాకు చెందిన నలుగురు అభ్యర్థులు మెతుకు ఆనంద్, కొప్పుల మహేశ్‌రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి, పైలెట్ రోహిత్‌రెడ్డిలు పట్నానికి పయనమవుతున్నారు. బీ ఫారాలతో పాటు మేనిఫెస్టో పట్టుకు రానున్న నేతలు ఇక ప్రచారంతో ప్రజల్లోకి దూసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు.

మూడు నియోజకవర్గాల్లో శంఖారావం పూర్తి

అధికార బీఆర్‌ఎస్ అన్ని పార్టీల కంటే ముందుగానే అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో వారు ఇక నేరుగా ఓట్లు అడిగేందుకు ప్రజల దగ్గరకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పార్టీ ఇన్‌చార్జులుగా ఉన్న నేతలు స్థానిక ముఖ్య నేతలతో సమావేశమై ప్రచారం విషయమై చర్చించారు. ఇదే సమయంలో ఎంపీ రంజిత్‌రెడ్డి నేతృత్వంలో అసంతృప్త నేతలను కలిసి బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు. అధికార పార్టీ అభ్యర్థులైన నలుగురు ఎమ్మెల్యేలు సోమవారం నుంచి ప్రచారం ప్రారంభించేందుకు సన్నద్ధమవుతున్నారు. వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో ఇప్పటికే కేటీఆర్, హరీశ్‌రావు ఒక దఫా మాస్ మీటింగ్ ఏర్పాటు చేసిన విషయం విదితమే. బహిరంగ సభలు నిర్వహించిన చోట గ్రామస్థాయి ప్రచారానికి ప్లాన్ చేస్తున్నారు.

ఓటు అడిగే హక్కు మాకే ఉంది



ఆదివారం బీ ఫారాలు తీసుకున్న తర్వాత సోమవారం నుంచి అన్ని నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తాం. అవసరాన్ని బట్టి మండల స్థాయి సమావేశాలు నిర్వహించడం.. కొన్ని చోట్ల గ్రామాల వారీగా ప్రచార కార్యక్రమం చేపడతాం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని జోడెడ్లుగా చేసి పరుగులు పెట్టించింది. ఎప్పుడు జరగని అభివృద్ధి సాధించాం. నిధుల వరద పారించాం. చేసిన పనినే ప్రజల ముందుంచుతాం. ఓటు అడిగే హక్కు బీఆర్‌ఎస్‌కే ఉంది.

– మెతుకు ఆనంద్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

ఓటర్లకు 'సీ-విజిల్'

ఎన్నికల అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్లను భాగస్వామ్యం చేస్తోంది. ఇందుకు 'సీ–విజిల్' యాప్‌ను తీసుకువచ్చింది. యాప్‌లో ఎవరైనా ఫిర్యాదు చేసిన వెంటనే జిల్లా ఎన్నికల అధికారితో పాటుగా నియోజకవర్గ ఫ్లయింగ్ స్క్వాడ్‌కు చేరుతుంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో యాప్‌పై అధికారులు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.

- ఎన్నికల అక్రమాలకు కళ్లెం వేసేందుకు సాంకేతిక నిఘా
- స్మార్ట్ ఫోన్ యూజర్లు ఫిర్యాదు చేసేందుకు అవకాశం
- వంద నిమిషాల్లోనే దర్యాప్తు



పరిగి: పారదర్శంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల నిర్వహణ సవాల్‌గా మారింది. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా డబ్బు, మద్యం విచ్చలవిడిగా పంపిణీ అవుతోంది. ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల కమిషన్ సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి పెద్దపీట వేస్తోంది. ఇందుకు ప్రత్యేకంగా 'సీ–విజిల్'అనే యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రస్తుతం దీనిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.

స్మార్ట్ ఫోన్‌లలో యాప్

ఎన్నికల అక్రమాలను నిరోధించేందుకు ఎన్నికల సంఘం 'సీ–విజిల్'యాప్‌ను ఆండ్రాయిడ్, స్మార్ట్ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేయించేందుకు విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ఎలక్షన్ కోడ్‌ను ఉల్లంఘిస్తే ఈ యాప్ సాయంతో ఫిర్యాదు చేయవచ్చు. స్మార్ట్‌ఫోన్ వినియోగదారులకు కెమెరా, జీపీఎస్‌కు యాక్సెస్ ఉంటేనే ఫిర్యాదుకు అవకాశం ఉంటుంది.

వివరాలు గోప్యం

ఎన్నికల ఉల్లంఘనలపై ఫిర్యాదు కోసం 'సీ–విజిల్'యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఫిర్యాదు దారుడి పేరు, చిరునామా పూర్తి వివరాలను అందించాల్సి ఉంటుంది. అనంతరం ఫిర్యాదు దారుడు ఫొటో లేదా గరిష్టంగా 2 నిమిషాల నిడివి ఉన్న వీడియోను యాప్‌లో అప్లోడ్ చేసి.. వివరాలు నమోదు చేయాలి. ఫిర్యాదు దారుడికి యాప్ నుంచి రిఫరెన్స్ నంబరు వస్తుంది. ఈ ఐడీ ద్వారా మొబైల్‌లో ఫిర్యాదు స్థితిని తెలుసుకోవచ్చు. ఫిర్యాదుదారుడి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతారు. గతంలో రికార్డు చేసిన వీడియోలు, ఫోటోలు అప్‌లోడ్ చేసే అవకాశం ఉండదు.

వంద నిమిషాల్లో పరిష్కారం

యాప్‌లో ఫిర్యాదుదారుడు అప్‌లోడ్ చేసిన వీడియో లేదా ఫొటోను ఐదు నిమిషాల్లో స్థానిక ఎన్నికల అధికారికి చేరుతుంది. ఫిర్యాదు సరైనదైతే ఆ సమస్య 100 నిమిషాల్లో పరిష్కారమయ్యే అవకాశం ఉంది. ఎన్నికల కమిషన్ ప్రకారం షెడ్యూలు విడుదల చేసిన అప్పటి నుంచి ఓటింగ్ ముగిసే వరకు ఎవరైనా తమ ఫిర్యాదును యాప్ సాయంతో నేరుగా ఎన్నికల కమిషన్‌కు పంపించవచ్చు.

అక్రమాలను అరికడతాం

శాసనసభ ఎన్నికలను పాదర్శకంగా నిర్వహిస్తాం. అక్రమాలను అరికట్టేందుకు 'సీ–విజిల్'యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. కోడ్ ఉల్లంఘనలపై నేరుగా యాప్ సాయంతో ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు వాస్తవమయితే 100 నిమిషాల్లో పరిష్కరిస్తాం. ఓటర్లు గ్రామాల్లో అక్రమాలపై ఫిర్యాదు చేయాలి.

– విజయకుమారి, ఆర్‌ఓ, పరిగి

క్లుప్తంగా

అక్రమ మద్యం పట్టివేత

తలకొండపల్లి: పల్లెల్లో బెల్ట్‌షాపుల దందా జోరుగా సాగుతోంది. గ్రామాలు, తండాల్లో పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు వెలుస్తున్నాయి. అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే బెల్ట్ షాపులపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఖానాపూర్ గ్రామంలో లక్ష్మయ్య అనే వ్యక్తి కిరాణా దుకాణంలో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడి చేశారు. నిందితుడి వద్ద నుంచి నాలుగు లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మయ్యపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

కరాటేలో రాణించిన విద్యార్థులు



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో కరాటే మాస్టర్లు, సర్పంచ్

కొడంగల్ రూరల్: విద్యార్థులు చదువుతో పాటు కరాటే నేర్చుకుంటే శరీర దారుఢ్యంతో పాటు చురుగ్గా ఉంటారని అంగడిరాయిచూర్ సర్పంచ్ గోవింద్ అన్నారు. శుక్రవారం మండల పరిధి అంగడిరాయిచూర్‌లో కరాటే మాస్టర్ వెంకటయ్య ఆధ్వర్యంలో కరాటే పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రావులపల్లి, అంగడిరాయిచూర్, కొడంగల్ తదితర గ్రామాల విద్యార్థులు, యువకులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారికి సర్పంచ్ సర్టిఫికెట్లు అందజేశారు. ఇందులో కరాటే మాస్టర్లు మహేశ్, పవన్ రాంచందర్, ప్రకాష్ ఉన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

తాండూరు టౌన్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై తాండూరు పట్టణ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఫ్లైఓవర్ కింద ఎస్‌కె సలీమ్ అనే వ్యక్తి 16లీటర్ల మద్యం సీసాలను విక్రయించేందుకు నిల్వ చేసుకున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సలీంను పట్టుకొని కేసు నమోదుచేశామని, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై అబ్దుల్ రవూఫ్ తెలిపారు.

తీరొక్క పూలతో బతుకమ్మ



గునుగుపూలను సేకరిస్తున్న చిన్నారులు

- తంగేడు పువ్వు పరమేశ్వరుడికి.. గుమ్మడి గౌరీదేవికి ప్రతీక
- రకరకాల పూలతో మహిళల కళానైపుణ్యం 'పూల సింగిడి'

వికారాబాద్ అర్బన్: బతుకమ్మ పేర్చడం ఒక కళ. అందుకు కావాల్సిన పూలను సేకరించడం ఓ కళ.. అడవి బాట పట్టి తీరొక్క పూలను తెంపి ఆడబిడ్డలకు కానుకగా ఇస్తే.. ఆ తల్లుల ఆనందం అంతాఇంతా కాదు. ఇదిలా ఉండగా.. తెచ్చిన పూలతో పూల గోపురం పేర్చడంలో మహిళల నైపుణ్యం, కళాత్మక దృష్టి కనిపిస్తుంది. మొదట ఒక పళ్లెం (తాంబాలం)లో గుమ్మడి ఆకులను పరుస్తారు. వాటి కింద నూల దారాలను రెండు వరుసల్లో వేస్తారు. గోపురం ఆకారంలో పేర్చిన బతుకమ్మ పూలు జారిపోకుండా ఈ దారాలను ఆధారంగా చేసుకుంటారు. బతుకమ్మను పేర్చడానికి గుమ్మడి ఆకు, తంగేడు, గునుగు పూలు తప్పనిసరి. మొదటి వరుసలో తంగేడు పూలను పెడతారు. తుంచిన పూలకాండలను, ఆకులను మధ్యలో వేస్తారు. రెండో వరుస గునుగ, తంగేడు పూలచే ఉంటుంది. గునుగుపూలు తెలుపు, రంగుల్లో వాడతారు. ఇలా ఒక్కో వరుస ఒక్కో రకం పూలను పేరుస్తారు. పైన తమలపాకుపై శంఖు ఆకారంలో పసుపు ముద్ద (గౌరమ్మ)ను ప్రతిష్ఠించి పూజిస్తారు. తల్లిబతుకమ్మ(పెద్దది)తో పాటు పిల్లబతుకమ్మ (చిన్నగా)ను కూడా పేరుస్తారు. అనంతరం పూజలు చేస్తారు.

కుండలిని యోగ విశేష శక్తిగా..

శక్తి ఆరాధనతో సర్వోత్కృష్టమైనది శ్రీ చక్రోపాసన. శక్తివంతమైన త్రిపురసుందరికి ఇది ప్రతిరూపం. బతుకమ్మను శ్రీచక్రంలోని కుండలిని యోగ విశేష శక్తిగా భావిస్తారు. శ్రీచక్రంలోని మేరు ప్రసాదంలో కింద చతురస్రం, అష్టభుజ, త్రిభుజంలా ఉంటుంది. అలాగే బతుకమ్మ ఉంటుంది. బతుకమ్మ పేర్పులో కూడా మూలాధారం నందలి శక్తిని, సహస్ర కమలం నందలి సదాశివుడితో సమాగింపచేయడం కన్పిస్తుంది. కుండలిని యోగ విశేషమైన శక్తిని గౌరమ్మగా నిలిపి పూజిస్తారు. వేదపండితులు మాత్రమే పూజించగలిగే చక్రోపాసనాన్ని సామాన్యులకు సైతం అందుబాటులోకి తెచ్చే విధంగా మహనీయులు చేసిన కృషి వలనే నేడు బతుకమ్మ పండుగ ఆవిర్భవించి ఉండవచ్చనే ప్రచారంలో ఉంది.



బతుకమ్మను పేరుస్తున్న మహిళ

పరమేశ్వరుడికి ప్రతీక తంగేడు..

మొదటి వరుసలో ఉండే తంగేడు పువ్వు పరమేశ్వరుడికి ప్రతీక కాగా.. పై భాగంలోని గుమ్మడి పువ్వు గౌరీ దేవికి ప్రతీక. మధ్యలో ఉన్న ఒక్కోజాతి పువ్వు కుండలిని యోగంలోని మూలాధార స్వాధిష్టానాలు అయిన రుద్రఖండం, విష్ణుఖండం, బ్రహ్మఖండంలోని పార్వతీ, లక్ష్మి, సరస్వతీ దేవీలకు ప్రతీక. బతుకమ్మను పేర్చిన అనంతరం చీకటి గదిలో కూరటికుండ ఎదుట అలికి ముగ్గులు వేసి బతుకమ్మను ప్రతిష్ఠిస్తారు. ఇక్కడ కమలం పువ్వు ముగ్గు వేస్తారు. అలాగే దుర్గాపూజలోని పూర్ణఘటం, సర్వతోభద్ర మండలాలకు కూడా బతుకమ్మతో పోలిక ఉంది. ఇలా బతుకమ్మ రూపంలోనూ, అలంకరణలోనూ, వస్తుసామగ్రిలోనూ.. పూజావిధానంలోనూ శక్తి ఆరాధన, తంత్రం, యంత్రపూజ, శక్తి పరిజ్ఞానం, ప్రకృతి ఆరాధన కన్పిస్తాయి.

కొడంగల్ 'బాహుబలి'

- 8 మండలాలు.. 3.42లక్షల జనాభా
- దౌల్తాబాద్‌లో అత్యధిక జనం
- కొత్తపల్లిలో అత్యల్పం
- రాష్ట్రంలోనే పెద్ద నియోజకవర్గం

కొడంగల్: తెలంగాణలో కొడంగల్ అసెంబ్లీ స్థానం బాహుబలి నియోజకవర్గంగా పేరు గాంచింది. 8 మండలాలు మూడు లక్షల 42 వేల జనాభాతో పెద్ద కానిస్టెన్సీగా ఏర్పడింది. గతంలో కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, కోస్గి, మద్దూరు మండలాలు మాత్రమే ఉండేవి. ఇటీవల ప్రభుత్వం కొత్తగా మూడు మండలాలను నియోజకవర్గంలో కలిపింది. బొంరాస్‌పేట మండలంలో దుద్యాల, కోసిగి మండలంలో గుండుమాల్, మద్దూరు మండలంలో కొత్తపల్లి గ్రామాలను మండల కేంద్రాలుగా మార్చారు. దీంతో కొడంగల్ 8 మండలాలతో పాలన కొనసాగుతోంది. రాష్ట్రంలో అత్యధిక మండలాలు కలిగిన నియోజకవర్గాల్లో కొడంగల్ ముందు వరుసలో ఉంది.

మండలాల వారీగా జనాభా


దౌల్తాబాద్ మండలంలో అత్యధిక జనాభా కలిగి ఉండగా.. కొత్తపల్లి మండలంలో తక్కువగా ఉంది. కొడంగల్‌లో 57,305 మంది, దౌల్తాబాద్‌లో 57,848, బొంరాస్‌పేటలో 43,959, కోస్గిలో 48,754, మద్దూరులో 53,817, గుండుమాల్‌లో 23,833, కొత్తపల్లిలో 22,929, దుద్యాలలో 33,527 మంది జనాభా ఉన్నారు.

కొడంగల్‌కు అన్యాయం

కొడంగల్‌ను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని అఖిలపక్ష నాయకుల డిమాండ్. జిల్లాల విభజన నేపథ్యంలో కొడంగల్‌కు అన్యాయం జరిగిందని చెప్పారు. మూడు మండలాలను వికారాబాద్‌లో కలిపి రెండు మండలాలను ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో ఉంచారు. దీంతో కొడంగల్‌లో ఉన్న డివిజన్ స్థాయి కార్యాలయాలు ఇతర ప్రాంతాలకు తరలిపోయాయి. కొడంగల్ మండల కేంద్రంగా మారింది. దీంతో ఈ ప్రాంత ప్రజల పోరాట ఫలితంగా కొన్ని కార్యాలయాలను తిరిగి ఏర్పాటు చేశారు. కొడంగల్‌ను డివిజన్ కేంద్రంగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

భవిష్యత్తులో రెండు సెగ్మెంట్లు

కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ప్రవేశపెడితే కొడంగల్ రెండు నియోజకవర్గాలుగా మారే అవకాశం ఉంది. ప్రస్తుతం కేంద్రం మహిళా బిల్లుకు ఆమోదం తెలిపింది. ఈ బిల్లు 2028 ఎన్నికల్లో అమలు కానుంది. అప్పుడే నియోజకవర్గాల పునర్విభజన కూడా జరగనుంది. దీంతో కొడంగల్‌లో ఉన్న 8 మండలాలను రెండు నియోజకవర్గాల పరిధిలోకి తెస్తారు. కొడంగల్ పరిధిలో కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాల ఉండే అవకాశం ఉంది. కోస్గి లేదా మద్దూరు ఈ రెండు మండలాల్లో ఏదో ఒక మండలాన్ని నియోజవకర్గ కేంద్రంగా ప్రకటిస్తారు. ఇందులో కోస్గి, గుండుమాల్, మద్దూరు, కొత్తపల్లి మండలాలు ఉంటాయి. దీంతో భవిష్యత్తులో కొడంగల్ రెండు నియోజకవర్గాలకు మూలబిందువుగా మారబోతుంది.



కొడంగల్ నియోజకవర్గ ముఖచిత్రం



కొత్త మండలం దుద్యాల

శాంతిభద్రతలకు ప్రాధాన్యం



కొడంగల్: వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసు అధికారులు

- ఎన్నికల నిబంధనలు పాటించాలి
- రిటర్నింగ్ అధికారి లింగ్యా నాయక్, డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి
- సరిహద్దు చెక్ పోస్టుల పరిశీలన

కొడంగల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో శాంతి భద్రతలకు తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నామని రిటర్నింగ్ అధికారి లింగ్యా నాయక్, పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి అన్నారు. శనివారం నియోజకవర్గ పరిధి సరిహద్దు పోలీస్ చెక్ పోస్టులను వారు పరిశీలించారు. కొడంగల్ మండలం కస్తూరుపల్లి సరిహద్దు, దౌల్తాబాద్ మండలం చంద్రకల్ చెక్‌పోస్టును సందర్శించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి తెలంగాణాలోకి వచ్చే వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. అనంతరం రావులపల్లిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులు సహకరించాలని కోరారు. ఇందులో తహసీల్దార్ విజయ్ కుమార్, సీఐ రాములు, ఎస్‌ఐలు ఉన్నారు.



పెద్దేముల్: అడ్కిచెర్లలో మద్యం స్వాధీనం చేసుకున్న పోలీసులు

మద్యం విక్రయిస్తే కేసులు

పెద్దేముల్: అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తే కేసులు పెడతామని ఎస్‌ఐ కాశీనాథ్ హెచ్చరించారు. పెద్దేముల్ మండలం అడ్కిచెర్లతో పాటు పలు గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయ దుకాణాలపై దాడులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్మిషన్ లేకుండా మద్యం విక్రయిస్తున్న యజమానిపై కేసు నమోదు చేసి, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

వేతనం రాదు.. వెతలు తీరవు

- ఉద్యోగ భద్రత అసలే లేదు
- దుర్భరంగా బతుకుతున్నాం: ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు

దౌల్తాబాద్: 'రెండు దశాబ్దాలుగా ఉపాధిహామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్నాం. కానీ మా కష్టాలు తీరువు. వేతనాలు సరిగా రావు. ఇక ఉద్యోగ భద్రత అసలే లేదు. దుర్భర జీవితం గడుపుతున్నాం' అని పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు ఆవేదన చెందుతున్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 45 మంది పనిచేస్తున్నామని, గ్రామాల్లో కూలీలకు ఉపాధి కల్పించడం, జాబ్ కార్డులు మంజూరు చేయడం, హరితహారం, ఫీల్డ్‌ఛానళ్లు, మొక్కల పంపిణీ లాంటి పనులు చేస్తున్నా.. శ్రమకు తగిన ఫలితం దక్కడంలేదని వాపోతున్నారు.

మధ్య ప్రదేశ్‌లో ఇలా..

మధ్యప్రదేశ్‌లో ఫీల్డ్ అసిస్టెంట్లకు అక్కడి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించందని, కనీస వేతనం రూ.18వేలు చెల్లిస్తుందని పలువురు పేర్కొన్నారు. సీనియార్టీ ప్రకారం పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి కల్పిస్తూ వస్తోందని, ఇదే విషయాన్ని తెలంగాణలో ఫీల్డ్ అసిస్టెంట్లు గతంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం సీఎం కేసీఆర్ అవుట్ సోర్సింగ్ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా నియమిస్తామని హామీ ఇచ్చారని, దాని కోసం ఎదురు చూస్తున్నామన్నారు.



హరితహారం కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు (ఫైల్)

సౌకర్యాలు లేక..

ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లకు హెల్త్‌కార్డులు లేవు. బీమా సౌకర్యం కల్పించడంలేదు. పేస్కేల్ అమలు చేయడం లేదు. పని ప్రదేశాల్లో అనారోగ్యానికి గురైనా విష సర్పాల బారిన పడి మృత్యువాత పడినా బాధిత కుటుంబానికి ఎలాంటి పరిహారం అందడంలేదు. క్షేత్రస్థాయిలో కూలీలతో కలిసి పనులను పర్యవేక్షిస్తున్నా.. తమ శ్రమను ప్రభుత్వం గుర్తించడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్లు ఆరోపిస్తున్నారు.

న్యాయం చేయాలి



ఉపాధి కూలీలకు పని కల్పిస్తూ 24గంటలు పనిచేస్తున్నాం. అయినా గుర్తింపు లేదు. ఇరవై ఏళ్లుగా చాలీచాలని జీతంతో దుర్భర జీవితం గడుపుతున్నాం. కనీస వేతనం అమలు చేయాలి. హెల్త్ కార్డులు మంజూరు చేయాలి. బీమా సౌకర్యం కల్పించాలి.

– అనంతయ్య, ఫీల్డ్‌అసిస్టెంట్, గోకఫసల్‌వాద్

జోరుగా బెల్టు దందా

తలకొండపల్లి: పల్లెల్లో బెల్ట్‌షాపుల దందా జోరుగా సాగుతోంది. గ్రామాలు, తండాల్లో విచ్చల విడిగా బెల్ట్ దుకాణాలు వెలుస్తున్నాయి. అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే బెల్ట్ షాపులపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఖానాపూర్‌లో మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఖానాపూర్ గ్రామంలో లక్ష్మయ్య అనే వ్యక్తి కిరాణా షాపులో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడి చేశారు. నిందితుడి వద్ద నుంచి నాలుగు లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మయ్యపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

విక్రయిస్తే చర్యలు

ఆమనగల్లు: కోనాపురం గ్రామంలో రాములు అనే వ్యక్తి నిర్వహిస్తున్న కిరాణా షాపుపై దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఆమనగల్లు ఎస్‌ఐ బాల్‌రాం ఓ ప్రకటనలో తెలిపారు. నిందితుడు అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో కిరాణాషాపులో తనిఖీ నిర్వహించినట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో 34 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని, రాములుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. అనుమతిలేకుండా మద్యం విక్రయించేవారిపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

షాద్‌నగర్ రూరల్: తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి బంగారం, నగదుతో పాటు సామాగ్రిని దోచుకెళ్లారు. పట్టణంలో భగత్‌సింగ్ కాలనీలోని ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన శనివారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీలో నివాసం ఉండే పాత్లావత్ రవి కుటుంబంతో సహా ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. అయితే శనివారం ఉదయం తిరిగి వచ్చేసరికి తలుపులు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బీరువాలో ఉన్న తులం బంగారం, 20 తులాల వెండి, రూ.45వేల నగదును ఎత్తుకెళ్లారని బాధితుడు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

పదవులు ముఖ్యం కాదు

- అభివృద్ధే లక్ష్యం
- కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు
- సవాల్ విసిరిన ఎమ్మెల్సీ
- 'గడప గడపకు కాంగ్రెస్'లో పాల్గొన్న పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: తనకు పదవులు ముఖ్యం కాదని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి స్పష్టం చేశారు. శనివారం మండలంలోని గానుగుమార్లతండా, కానుగుబావితండాలో 'గడప గడపకు కాంగ్రెస్' ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నారాయణరెడ్డి, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై.. గడప గడపకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేయనున్న ఆరు గ్యారంటీ పథకాలపై ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అంతేకాదు ఈ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పనితీరుతో ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే కల్వకుర్తి నియోజకవర్గం అత్యంత వెనుకబాటుకు గురైందని, అభివృద్ధి చెందలేదని విమర్శించారు. నియోజకవర్గంలో సాగునీటి అందించడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయడంలో విద్యావ్యవస్థను అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కాల్వ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం ఇప్పించలేకపోయారని ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే చర్చకు సిద్ధమా అని కసిరెడ్డి సవాల్ విసిరారు. ప్రజలు, కార్యకర్తల, నాయకుల ఒత్తిడి మేరకే కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేసే నాయకుడిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అధికారంలోకి రాగానే ప్రజా సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆశీర్వాదించాలని కోరారు.



ప్రచారంలో మాట్లాడుతున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్

గడప గడపకు కాంగ్రెస్ ప్రచార కార్యక్రమంలో భాగంగా గానుగుమార్లతండాలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన స్థానిక సర్పంచ్ హంశ్యామోత్యానాయక్, నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మండల కాంగ్రెస్‌అధ్యక్షులు బీచ్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబ, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నలుగురి అరెస్టు

ఇబ్రహీంపట్నం రూరల్: హత్య జరిగిన 24 గంటల్లోనే నిందితులను ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం మండలం, పోర్లగడ్డ తండాకు చెందిన సీతారాంను అతని బామ్మర్ది శుక్రవారం ముగ్గురు వ్యక్తులతో కలిసి ఇనుపరాడ్డుతో కొట్టి హతమార్చాడు. ఈ ఘటనలో అంగోతు సాయికుమార్(24), మీనం అనిల్(30), అంగోతు తరుణ్(22), పర్సమోని అశోక్ అనే నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, వారి నుంచి మహేంద్ర మిరాజో కారు, రెండు సెల్‌ఫోన్లు, ఇనుపరాడ్డును స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఊరెళ్తున్నారా.. జాగ్రత్త

- వచ్చేలోపు ఇల్లు గుల్ల కావొచ్చు!
- బ్యాంకు లాకర్లలోనే నగలు, డబ్బులు భద్రం
- సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ
- ప్రయాణ సమయాల్లో జాగ్రత్తలు అవసరం
- ప్రజలకు పోలీసుల సూచనలు

షాద్‌నగర్: దసరా పండుగ సెలవులు ప్రారంభం అయ్యాయి. విద్యాసంస్థలకు సెలవులు ఇచ్చేశారు. ఈ సమయంలో ఇళ్లకు తాళాలు వేసి సకుటుంబంగా ఊరేళ్తున్నారా? తస్మాత్ జాగ్రత్త అని పోలీసులు హెచ్చరిస్తున్నారు. సొంతూరుకు వెళ్లే హడావుడిలో చాలా మంది ఇంటి భద్రత గురించి పట్టించుకోరు. అజాగ్రత్తగా ఉంటే అంతే.. మీ ఇల్లు గుల్ల అవుతుంది. పండుగ వేళల్లో ఇంటికి తాళం ఉంటే దొంగల కన్ను పడుతుంది. సుదూర ప్రాంతాలకు పయనమయ్యేవారు. పండుగ నేపథ్యంలో ఊర్లకు వెళ్లే వారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిందేనని పోలీసులు చెబుతున్నారు. ముందు జాగ్రత్తలు తీసుకుంటే దొంగతనాలను అరికట్టవచ్చని సూచిస్తున్నారు.

పోలీసుల సూచనలు

- పండుగకు ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాల్సివస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి.
- ఇంటి దగ్గర నమ్మకమైన సెక్యూరిటీ గార్డును పెట్టుకోవాలి.
- బీరువాలు, అల్మారా, కప్‌బోర్డుల తాళాలను రహస్య ప్రదేశంలో ఉంచాలి.
- మీ ద్విచక్ర వాహనాలను ఇంటి ఆవరణలో పార్కు చేసి లాక్ వేయాలి.
- ఇంట్లో సీసీ కెమెరాలను అమర్చుకొని వాటిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలి.
- మీరు బయటికి వెళ్లే విషయాన్ని సోషల్ మీడియాలో ఇతరులకు షేర్ చేయడం మంచిది కాదు.
- ఊరెళ్లే ముందు ఇంటి ఆవరణలో ఉన్న లైట్లు వేసి వెళ్లాలి.
- కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. లేదంటే 100 డయల్ చేయాలి.



- ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టం తాళంను అమర్చుకోవాలి.
- ఇంటికి ఇరువైపులా నమ్మకమైన వారు ఉంటే మీ ఇంటిని గమనిస్తూ ఉండమని చెప్పి వెళ్లాలి.

బ్యాంకుల్లోనే భద్రం

ఎంతో కష్టపడి కొనుగోలు చేసిన నగలు, సంపాదించిన డబ్బులు పోతే ఆ బాధ వర్ణనాతీతం. అలాంటి వాటికి అడ్డుకట్ట వేయాలంటే ఊర్లె ముందు ఇంట్లో ఉన్న నగలు, నగదును బ్యాంకు లాకర్‌లో పెట్టుకోవడం మంచిది. లాకర్లు లేని వారు తమకు తెలిసిన వారి ఇళ్లలో, బంధువుల దగ్గర భద్రపర్చుకోవాలి. పోలీసులు కూడ ఇదే విషయాన్ని చెబుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇలా నగలు, నగదు, పత్రాలు దాచిపెట్టుకోవడం వల్ల ఆందోళన చెందకుండా సంతోషంగా పండుగను జరుపుకోవచ్చు.

జాగ్రత్తలు అవసరం

ప్రయాణంలోనూ జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే దొంగలు మన పక్కనే ఉండి గమనిస్తూ అదును దొరకగానే డబ్బులు, నగలు సామాగ్రితో ఉడాయిస్తారు. బస్సులు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. ప్రయాణిస్తున్నప్పుడు చాలా మంది సీట్లలో బ్యాగులను వదిలి తినుబండారాలు, తాగునీటి కోసం బస్సులు దిగుతుంటారు. ఇలాంటి సమయంలోనే దొంగలు అపహరించుకుపోతారు. ప్రయాణాల్లో మహిళలు, చిన్నారులు బంగారు ఆభరణాలు ధరించకపోవడమే మంచిది. అదేవిధంగా కార్లలో వెళ్లే వారు కూడ మధ్యలో ఆపి హోటళ్లకు వెళ్తుంటారు. దొంగలు అద్దాలు పగలగొట్టి అందులో ఉన్న సామాగ్రిని ఎత్తుకుపోతుంటారు. దొంగతనాల నివారణపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా కూడ ప్రజలకు సూచనలు చేస్తున్నారు.